క్లుప్తంగా

ప్రశాంతంగా టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ ఆన్‌లైన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ పరీక్ష కేంద్రంలో రెండు షిఫ్టుల్లో మంగళవారం ఏపీ టెట్ పరీక్ష నిర్వహించారు. మొదటి షిఫ్టులో 100 మందికి 89, రెండో షిఫ్టులో 100 మందికి 95 మంది హాజరయ్యారు. పరీక్షలను జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

హైందవ ధర్మ ప్రచారానికి ముందుకు రావాలి

శ్రీకాకుళం: హైందవ ధర్మ ప్రచారం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషి వెలకట్టలేనిదని, హైందవ ధర్మ ప్రచారం చేసేందుకు హిందువులంతా ముందుకు రావాలని శ్రీకూర్మం ఆలయ కార్యనిర్వాహణ అధికారి జి.గురునాథరావు పిలుపునిచ్చారు. విశాఖపట్నం నుంచి కోల్‌కతాకు సైకిల్‌పై వెళుతున్న మహేంద్ర అనే యాత్రికుడికి ఆదిత్య జుంబా నడక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో స్వాగతం పలికారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహేంద్రకు సంఘీభావం తెలియజేశారు. ఆరోగ్య భారత్ సాధనకు సైకిల్ యాత్ర ఉపకరిస్తుందని అన్నారు. దసరా పండుగ సందర్భంగా కోల్‌కతాలోని కాళీమాతను దర్శించుకునేందుకు విశాఖ జిల్లా అచ్యుతాపురం నుంచి వెళ్తున్నట్టు మహేంద్ర చెప్పారు. ఆదిత్య జుంబా డాన్స్ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, కింతలి సాయికుమార్, బి.గారయ్య, బి.రామకృష్ణ, హిందూ ధర్మప్రచార పరిషత్ ట్రస్ట్ జిల్లా కన్వీనర్ శాసనపు జోగినాయుడు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఆర్డీవోలు



ఎస్పీ మహేశ్వరరెడ్డికి మొక్కను అందజేస్తున్న శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలుగా బాధ్యతలు చేపట్టిన కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తిలు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రూప్–1లో మంచి ఉత్తీర్ణత సాధించి ఆర్డీవోలుగా ఎంపికైనందుకు ఎస్పీ అభినందించారు. తమ డివిజన్ల పరిధిలో రెవెన్యూపరంగా మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం పరిపాలన, తదితర అంశాలపై మాట్లాడారు.

క్యాన్సర్‌పై అవగాహన



వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగా ప్రయద్శిని అన్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మహిళలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ముందుగా తెలుసుకుంటే క్యాన్సర్‌కు చికిత్స సాధ్యమేనన్నారు. పీహెచ్‌సీల్లో డెలివరీలు పెరగాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యురాలు ఉషారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు పరిశీలన



ఈ–పంట నమోదు పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిప్రత్యూష

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ–పంట నమోదు పక్కాగా ఉండాలని శ్రీకాకుళం ఆర్డీఓ సాయిప్రత్యూష అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని తమ్మినాయుడుపేటలో మంగళవారం ఈ–పంట నమోదును నిర్వహించారు. వరి, ఉద్యాన వన పంటలు, తోటలు తదితర పంటల నమోదులో స్పష్టత ఉండాలన్నారు. వరి పంట నమోదు ఆధారంగా కొనుగోళ్లు జరుగుతాయన్నారు. ఈ–పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలు వంటి వాటిపై అంచనా తెలుస్తోందన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.రజిని, తహసీల్దార్ ఎ.సింహాచలం, ఏఓ వై.సురేష్ పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద మంగళవారం విశాఖ వైపు వెళ్లే ఇసుక లారీలను జే.ఆర్.పురం పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపి పత్రాలను తనిఖీలు చేశారు. ఒక ఇసుక లారీకి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని జే.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

మూలకు చేరిన మూత్రశాలలు!

- తాళాలు వేసేసిన వైనం
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



దే అండ్ నైట్ కూడలి వద్ద ప్రజామూత్రశాల వద్ద దుస్థితి..



ప్రజామూత్రశాలకు తాళాలు వేసిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజా మూత్రశాలలు మూలకు చేరాయి. వినియోగంలోకి తీసుకురావాల్సిన సంబంధిత అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే అపవాదును మూటగట్టుకున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే అవేమి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరానికి రోజూ వేలాది మంది ఆస్పత్రులు, కాలేజీలు, మార్కెట్‌తోపాటు వివిధ అవసరాల కోసం వస్తుంటారు. ఆరుబయట మూత్రవిసర్జన చట్టరీత్యా నేరం. మహిళలు కూడా చాలా ఇబ్బంది పడే అవకాశం ఉంది. అయితే ప్రజావసరాల నిమిత్తం నగరంలోని డే అండ్ నైట్, కలెక్టరేట్‌కి సమీపంలో పొన్నాడ వంతెన, పాతబస్టాండ్, రామలక్ష్మణ కూడలి వద్ద ప్రజామూత్రశాలలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ అప్పట్లో ఒడిశాకు చెందిన కాంట్రాక్టర్‌కి అప్పగించారు. ఈ ఏడాది మార్చి నెల వరకు కాంట్రాక్టు ఉంది. గడువు ముగిసిన తరువాత కూడా కొంతకాలం నిర్వహించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా మూత్రశాలల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కార్పొరేషన్ అధికారులు ఏకంగా వాటికి తాళాలు వేసేశారు. ప్రజామరుగుదొడ్లు, ప్రజామూత్రశాలల్లో టైల్స్, ట్యాంక్ క్లీనింగ్, ట్యాప్‌లు, నీటి సరఫరా వంటివి తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. అవేమి చేయకుండా పూర్తిగా వదిలేశారు. దీంతో అవి పాడయ్యే పరిస్థితికి చేరుతున్నాయి. కొంతమంది అత్యవసర సమయంలో మూత్రశాలల వెనుక ఖాళీ స్థలాలను వాడుతున్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లి దోమలు, పందులకు నిలయాలుగా మారుతున్నారు. ఇవన్నీ ప్రధాన కూడళ్లలో ఉండడంతో తీవ్ర దుర్వాసన రావడంతో ముక్కులు మూసుకుని ప్రయాణాలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. డే అండ్ నైట్ సిగ్నల్ పాయింట్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రజారోగ్యమే తమ లక్ష్యం, స్వచ్ఛతా హీ సేవా వంటి కార్యక్రమాలు చేపట్టినా ఉపయోగం లేకుండా పోయిందని నగర వాసులు అంటున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించేందుకు అనేక పథకాలు చేపడుతున్నామని కూటమి ప్రభుత్వం ఊకదంపుడు ప్రచారాలే తప్పా ఆచరణలో ఎక్కడా కానరావడంతో లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రజా మూత్ర శాలల వినియోగం లేకపోవడంతో కొంత మంది ఈ స్థలాలను చీకటి కార్యకలాపాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కంపుతో ఇబ్బంది



ప్రజామూత్రశాలలు పని చేయడం లేదు. చాలామంది అలవాటు ప్రకారం వీటి వద్దకు వస్తున్నారు. అయితే తాళాలు వేసేయడంతో ఆరుబయట మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో భరించలేని వాసనతో వాటివైపు వెళ్లలేకపోతున్నాం. తాళాలు తీసి ప్రజలంతా వాడేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–ఎ.ధర్మరాజు, కత్తెరవీధి, శ్రీకాకుళం.

చర్యలు తీసుకుంటాం



నగరంలోని ప్రజా మూత్రశాలలపై దృష్టిసారిస్తాం. వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాం. ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. కొత్తగా వాటి నిర్వహణకు కాంట్రాక్టర్‌ని పిలిచి అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

–పి.వి.వి.డి.ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్, శ్రీకాకుళం

విద్యార్థులకు అభినందన



గాయత్రి, హేమంత్‌లను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రబాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చూపించిన పోరాట స్ఫూర్తిని జాతీయ పోటీల్లోను చూపించి శ్రీకాకుళం జిల్లా ఖ్యాతిని మరింతగా చాటిచెప్పాలని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జామి భీమశంకరరావు అన్నారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నునపర్తి వేదికగా జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో శ్రీకాకుళం బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన విషయం తెలిసిందే. తమ కళాశాలలో చదువుతూ రాష్ట్రపోటీల్లో రాణించడంతోపాటు జాతీయ పోటీకుల ఎంపికైన ఇద్దరు విద్యార్థులు ముంత గాయత్రి (ఎచ్చెర్ల), ఎస్.హేమంత్‌కుమార్ (కుశాలపురం)ను మంగళవారం ఆయన కళాశాలలో అభినందించారు. కళాశాల ప్రతినిధులు కిరణ్, సంపత్‌కుమార్, శ్రీనివాసరావు, వీటీ నాయుడు, కోచ్ ఎం.మధుసూదన్, వై.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి



ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ శోభారాణికి వినతి ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలపై వార్డ్ ఇన్‌చార్జిల ప్రమేయం లేకుండా కేంద్రాలు నడిచేటట్లు చూడాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కల్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని గుజరాతీపేటలోగల ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయంలో శ్రీకాకుళం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో శోభారాణిని ఆమె ఛాంబర్‌లో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుని యూనియన్ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన విధంగా అన్ని యాప్‌లూ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, రికార్డు వర్క్ తగ్గించాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రతినిధులు జి.బేబీరాణి, కె.సుబ్బారావమ్మ, వై.లలితకుమారి, జి.రోజాకుమారి, పి.లత, కె.జ్యోతి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'శామ్‌సంగ్' కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. తమిళనాడు పెరంబదూర్‌లో ఆ కంపెనీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ కూడలి సమీప శామ్‌సంగ్ షాపు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ.. 1926 ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం కంపెనీలో పనిచేస్తున్న 1800 మంది కార్మికుల సమస్యలను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, దీంతో 1450 మంది కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. కార్మికచట్టాన్ని ఉల్లంఘించిన శామ్‌సంగ్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కె.సూర య్య, అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనరు ఆర్.ప్రకాషరావు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అమెరికా, ఇజ్రాయిల్‌లో యుద్ధోన్మాదం నశించాలని, పశ్చిమ ఆసియాలో శాంతి నెలకొల్పాలని, పాలస్తీనా భూభాగాన్ని వారికే అప్పగించాలని నినాదాలు చేస్తూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. మంగళవారం రాత్రి సూర్యమహల్ కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏఐపీఎస్‌ఓ కన్వీనర్ బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దుర్మార్గానికి అంతులేకుండా పోతుందని, గాజాలో 42 వేల మంది పాలస్తీనీయన్లను ఊచకోత కోసిందన్నారు. వారిలో 26 వేల మంది చిన్నారులన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి ఈ యుద్ధానికి ముగింపు పలకాలని తీర్మానం పెడితే అమెరికా అడ్డుకుందని, భారత్ ఓటింగ్‌కు గైర్హాజరైందని, ఇజ్రాయిల్‌కు ఆయుధాలను, మందుగుండు సామగ్రిని మోదీ ప్రభుత్వం దిగుమతి చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కె.నాగమణి, ఆర్.స్వప్న, మెహబూబా, ఖాన్, షాను, వీజీకే మూర్తి, చంద్రశేఖర్, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: సమష్టి కృషితోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌ల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీల కార్యాచరణ ప్రణాళికల అమల్లో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ పథకాలు సద్వినియోగం, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం వంటివి కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం, ఆర్థిక సంఘం నిధులు వంటివి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరిహరరావు, పంచాయతీ విస్తరణ అధికారి మల్లీశ్వరరావు, పరిపాలన అధికారి రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



విజయోత్సవంలో బీజేపీ శ్రేణులు

శ్రీకాకుళం న్యూకాలనీ: హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి బీజేపీ విజయం సాధించడంపై శ్రీకాకుళంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లోని ఆర్ట్స్ కళాశాల రోడ్‌లో బాణసంచా కాల్చి సందడి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జీ, గొలివి కరుణాకర్, చల్లా వెంకటేశ్వరరావు, పూజారి చెల్లయ్య, నరేంద్రచక్రవర్తి ఉన్నారు.

14న పల్లె పండుగ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'పల్లె పండుగ' పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో పల్లె పండుగ కార్యక్రమాలపై మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని, అన్ని పంచాయతీలు పరిధిలో 3071 పనులను గుర్తించి, వాటికి సంబంధించి రూ.249 కోట్లు అంచనాలు వేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 2714 పనులకు సంబంధించి ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చి, అప్‌లోడ్ చేశామని, మిగిలినవి రానున్న రెండు రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. ఆయా పనులకు ఎలాంటి ఇసుక కొరత లేదని, సిమెంట్‌కి సంబంధించి డీలర్లతో మాట్లాడుతున్నామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తోలాపి, శ్రీకాకుళం



క్రికెట్ క్రీడాకారులతో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సత్యసాయి బాబా 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా దేశ వ్యాప్తంగా యువతలో నాయకత్వ లక్షణాలు, ఐక్యత, శారీరక ఆరోగ్యమే లక్ష్యంగా శ్రీసత్యసాయి క్రికెట్ లీగ్ పోటీలు దేశ వ్యాప్తంగా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి ఏపీ అధ్యక్షుడు రఘుపాత్రుల లక్ష్మణరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఐదు జట్లు పాల్గొనగా మొదటి రెండు స్థానాల్లో తోలాపి, శ్రీకాకుళం పట్టణం నిలిచాయి. వీరికి బహుమతులు అందజేశారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని లక్ష్మణరావు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, జోనల్ కన్వీనర్ శివనారాయణ పాల్గొన్నారు.

రిటైర్డు హోంగార్డుకు సత్కారం



తారకేశ్వరరావును సన్మానిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఎస్.తారకేశ్వరరావును ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో దుశ్శాలువతో సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందించారు. తక్షణ ఆర్థిక చేయూతగా రూ.5 వేలు చెక్కును అందజేశారు.

విజయ గణపతికి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ఉదయం పాలతో అభిషేకాలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా చెవిటమ్మతల్లి పండుగ



అమ్మవారికి ముర్రాటలు సమర్పిస్తున్న భక్తులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని క్రిష్ణప్పపేట గ్రామంలో మంగళవారం చెవిటమ్మతల్లి గ్రామదేవత పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ శ్రీకాకుళం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రజిని అన్నారు. పూడివలస గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. రబీలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్కువ నీటి వినియోగం ఉండే పంటలను వేయాలన్నారు. చిరు, తృణ ధాన్యాలు వంటి సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏఓ సురేష్, సర్పంచ్ జరుగుళ్ల కృష్ణ పాల్గొన్నారు.

జగన్మాతా పాహిమాం..



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల దుర్గాదేవి మండపంలో కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు వీధివీధిలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం వివిధ అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలు మండపాల వద్ద దీపారాధనలు నిర్వహించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.



శ్రీకాకుళం కల్చరల్: శ్రీమహాలక్ష్మిగా నానుబాలవీధి విజయదుర్గ



శ్రీకాకుళం రూరల్: బైరివానిపేటలో కుంకుమ పూజలు



అయ్యప్పస్వామి ఆలయంలో మహాలక్ష్మికి పూజలు



ఎచ్చెర్ల క్యాంపస్: కుంచాలకూర్మయ్యపేట దుర్గా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మొండేటివీధిలో లలితాదేవిని ఊరేగిస్తున్న భక్తులు

ముత్యాలమ్మతల్లికి పూజలు



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కాకివీధిలో వేంచేసిన గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయ వద్ద జరుగుతున్న దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే రెడ్డిపేట–ఎస్ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. అమ్మవారికి కలశాలతో మహిళలు పూజలు చేశారు.